రహస్యం కావాలి!

కురుమద్దాలి విజయలక్ష్మి

సాయంత్రం ఆరుగంటల సమయం—

స్ట్రీట్ లైట్స్ గప్పున వెలిగాయి.

రంగూన్ పెద్ద బజారు ఆ వెలుగులో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నది. ఉండి ఉండి తుప్పర పడుతున్నది. అయినా షాపులు కిటకిటలాడుతున్నాయి. బజారులో జనం, షాపుల్లో జనం నేల ఈనినట్లున్నారు.

రెయిన్ కోటు ధరించి, చప్పుడు చేయని మెత్తని బూట్లు, తలపై ఈవెనింగ్ హేటు, చేతిలో బరువుగా ఉన్న సూట్ కేసు. వేగంగా ముందుకు అడుగులేస్తున్నాను.

ఎవరయినా నన్ను గమనిస్తారేమో అని, టోపీ ముఖం మీదకు లాక్కొని తలవంచుకుని ముందుకు సాగాను.

అరగంట నడిచి చిన్న సందులోకి ప్రవేశించాను.

పేరుకి చిన్న సందయినా జనం రాకపోకలు ఎక్కువ గానే ఉన్నాయి. చైనావాడు నడుపుతున్న చిన్న హోటల్ ఎక్కడో, అని గమనిస్తూ పది అడుగులు వేశానో, లేదో ఆ హోటల్ కనపడింది.

హోటల్ ముందున్న నాలుగు మెట్లు ఎక్కి హోటల్లో ప్రవేశించాను.

హోటల్ అంత రష్‌గా లేదు.

నన్ను చూస్తూనే బట్లర్ చకచక నా వద్దకు వచ్చాడు. "రండి సార్! మీకు కావలసినవి వేడిగా రెడీగా ఉన్నాయి" అన్నాడు వినయంగా.

చేతినిండా పనిలేని బట్లర్‌ని చూస్తుంటే, హోటల్ పరిస్థితి అంతంత మాత్రంగా నడుస్తున్నదని తెలిసి పోతున్నది.

నాకేం అక్కరలేదు అన్నట్లు చిరునవ్వుతో తల అడ్డంగా తిప్పాను.

నేనెందుకొచ్చానో బట్లర్‌కి అర్థంకాలేదు. అయోమయంగా చూచాడు.

"అర్జంట్‌గా మేనేజర్‌ని కలుసుకొని మాట్లాడాలి. ఆ కౌంటర్‌లో ఉంది హోటల్ మేనేజరేనా?"

"అవును. అతనే మేనేజరు, ఓనరు సమస్తం" అన్నాడు బట్లర్, నన్ను కిందనుంచి పైదాకా పరీక్షగా చూస్తూ.

"అతడి పేరు?"

"వాంగ్ యూచూ."

"థాంక్స్."

గబగబ కౌంటర్ వేపు నడిచాను.

నేను బట్లరు మాట్లాడటం అంతవరకు గమనిస్తున్న వాంగ్ యీ చూ నన్ను చూడనట్లు ముఖం పక్కకు తిప్పి, నిదారుగా కూర్చున్నాడు కుర్చీలో.

"మిస్టర్ వాంగ్ యీచూ, అర్జంట్ గా రూం కావాలి" అన్నాను.

"మా హోటల్లోని మొత్తం రూమ్స్ పది. ఆ పది ఎప్పుడో ఫిలప్ అయిపోయాయి. సారీసర్. మరో చోట ప్రయత్నించండి."

"అర్జంట్ అని ముందే చెప్పాకదా! నే ఎప్పుడు ఈ వూరొచ్చినా పెద్ద హోటల్స్‌లో నే దిగుతాను. కాని... ప్రస్తుతం ఓ మారుమూలగా ఉన్న చిన్న హోటల్లో చిన్న గది ఉంటే చాలు. అన్నట్లు మీ హోటల్లో రూమ్ రెంట్ ఎంత?"

"రోజుకి అయిదు."

"అహా."

దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు ముఖం పెట్టి, 'ఈ విషమ సమస్యనుంచి తప్పించుకోటం ఎట్లా అబ్బా!' అన్నట్లు మునిపంటితో పెదవి కొరుకుతూ నొసలు ముడివేశాను.

వీడు ఎలాంటి రకమూ? అని వాంగ్ యీచూ నన్నే గమనిస్తున్నాడు.

"మిస్టర్ వాంగ్ యీచూ! రోజుకి పాతిక ఇస్తాను. రూమ్ చూడండి. రూమ్ ఇరుకయినా ఫరవాలేదు సర్దుకుపోతాను."

"రోజుకి పాతికా?" నోరు తెరిచాడు వాంగ్ యీచూ.

"ఆఁ. పాతిక, అక్షరాలా పాతిక ఇస్తాను."

వాంగ్ యీ చూ ముఖంలో బాధ చోటు చేసుకుంది.

"ఒకే ఒక్క రూమ్ నాలుగు రోజులనుంచీ ఖాళీగా వుంది? గంటకు క్రితమే ఒకతను వారంరోజులకు బుక్ చేసుకున్నాడు."

"మీరుండేది ఎక్కడ?"

"మేడమీద. కింద హోటలు పైన మేముండే హౌస్."

"రోజుకి యాభై ఇస్తాను. మీరుండే హౌస్‌లో చిన్న గది వుంటే ఇవ్వండి. సరీగా ఒక నెల మాత్రమే ఉంటాను. అవసరం, అర్జంట్" అవసరం, అర్జంట్ అన్న మాటలు నొక్కి పలుకుతూ అన్నాను.

వాంగ్ యీ చూ ఆలోచనలో పడ్డాడు. నెలకి ఎంత పెద్ద మొత్తం అవుతుందో ఆలోచించి లెక్క వేశాడు. చాలా పెద్ద అంకె కళ్ళముందు కదులాడింది. వెంటనే దీనిలో ఏదయినా మోసం ఉంటుందా అని చిన్న అనుమానం ప్రవేశించింది.

వాంగ్ యీ చూని పరిశీలనగా చూస్తున్న నాకు అతని మనస్తత్వం బాగా అర్థం అయింది. డబ్బు మనిషి. నాకు కావలసింది అదే.

"అర్జంట్, అన్నమాట మీకు అనుమానం కలిగించి ఉంటుంది. అవునా?" వాంగ్ యీ చూ కళ్ళల్లోకి గుచ్చి చూస్తూ అన్నాను.

"అబ్బెబ్బె! అదేం లేదు. మీకు తప్పక రూమ్ కావాలంటున్నారు. నాకూ ఇవ్వాలనే ఉంది. ఎలాగా, అని ఆలోచిస్తున్నాను. పైన మేముండేది నాలుగు గదులు. సామానుతో నిండివుంటాయి ఆ గదులు నాలుగు..."

"మీ రెంతమంది ఉంటారు?"

"నేనూ, నా వైఫ్. సామానే ఎక్కువ?"

"ఇహ మీరేం చెప్పొద్దు. మీ ఇరువురే కాబట్టి ఎలాగో అలా ఓ నెల సర్దుకోండి" అంటూ సూట్ కేస్ కొద్దిగా తెరిచాను.

వాంగ్ యీచూ చూపులు తెరిచిన నా సూట్ కేస్ పై పడ్డాయి. సూట్ కేస్ నిండా కొత్త రూపాయల కట్టలు. మేలి ముత్యాలహారం. విలువయిన రత్నాలు రెండు ఉన్నాయి. సూట్ కేస్ మూత కొద్దిగా తెరిచినా సూట్ కేస్ లో ఏముందో చూచే ఉంటాడు. ఈ విషయం గమనించాను.

వాంగ్ యీచూ చేతిలో "ఎడ్వాన్స్" అంటూ నాలుగు పెద్ద కాగితాలు సరికొత్తవి పెట్టాను. "ఇప్పుడే వస్తాను" అంటూ ఓ పక్కనే ఉన్న మేడమెట్లకేసి వెళ్ళి వేగంగా మెట్లు ఎక్కుతూ పైకి వెళ్ళాడు వాంగ్ యీచూ.

నా సంభాషణ ఎవరైనా విన్నారా? నన్నెవరయినా గమనిస్తున్నారా? అని నలువైపులా చూచాను.

ఎవరి దోవన వారు తినటం, తాగటంలో మునిగిపోయి ఉన్నారు. తృప్తిగా శ్వాస పీల్చుకున్నాను.

తుప్పర్లు పడుతున్న వాన పెద్దదయింది.

వాంగ్ యీచూ నిరాశగా అతి నెమ్మదిగా నడుస్తూ వచ్చాడు. కౌంటర్ వద్దకు రాంగానే తల వంచుకుని నా నోట్లు నా చేతిలో ఉంచుతూ, "సారీ! రూమ్ ఇవ్వటానికి నా వైఫ్ ఒప్పుకోవటంలేదు. కాని..." అర్థోక్తిగా ఆగిపోయ్యాడు.

"సంశయించవద్దు. చెప్పండి," ఆతృతగా అడిగాను.

"నా వైఫ్ సంగతి మీకు తెలియదు. అనుమానం పెద్దమ్మ. పెద్దపెద్ద హోటల్స్ కిచ్చే చార్జీ ఇచ్చి మనింట్లో

ఉంటానంటే ఏదో పెద్ద కారణం ఉండే ఉంటుంది. మీరేమో ఆ హోటల్లో పడివుంటారు. మనింట్లో గది ఇవ్వటమంటే ఆలోచించాల్సిన విషయం. అతనంతగా ప్రాధేయపడుతున్నాడంటున్నారు గాబట్టి ఎడ్వాన్స్ ఇచ్చిన డబ్బు వదులుకొని ఏరోజు కారోజు ఓ గంట కూడా ఆలశ్యం కాకుండా డబ్బు ఇస్తాడేమో కను క్కోండి అంది. మీ అవసరంకొద్దీ ఇప్పటికే రూం రెంట్ ఎక్కువిస్తున్నారు. ఇంకా ఎడ్వాన్స్ వదులుకోమంటే ఏం బాగుంటుంది చెప్పండి. నా వైఫ్ సంగతి చెప్పా కదా! మొండిది. ఆశ ఎక్కువ. దయచేసి మరోచోట ప్రయత్నించండి,'' అన్నాడు వాంగ్ యాచు.

నా మనసు తేలికపడింది.

''మనం చాలా తేలికగా తీసుకునే విషయాలు ఆడ వాళ్ళు సీరియస్ గా తీసుకుంటారు. రూపాయొస్తే మనం సంతోషపడతాము. ఆడవాళ్ళకు రూపాయి వచ్చే చోట అయిదు రూపాయిలొచ్చినా తృప్తిపడరు. సిల్లీ ఎడ్వాన్స్ తిరిగి ఇవ్వక్కరలేదు. తొందరగా రూమ్ ఖాళీ చేయిం చండి. కాస్త విశ్రాంతి తీసుకోవాలి'' చేతిలో ఉన్న నోట్లు వాంగ్ యాచూ ముందు వుంచాను.

వాంగ్ యాచూ ముఖం వికసించింది.

''అలా ఛయిర్ లో కూర్చోండి. మీకు కావలసినవి తెప్పించుకుని తినండి. గది ఖాళీ చేయించమని చెప్పి వస్తాను. అన్నట్లు మీ పేరు?''

''పనికర్,'' పేరు చెప్పి సూట్ కేస్ అందుకుని ఛయిర్ దగ్గరకు నడిచాను.

వాంగ్ యాచూ కౌంటర్ వద్ద వేరే మనిషిని ఉంచి, మేడపైకి వెళ్ళాడు.

'హోటల్లో స్థానం సంపాదించాను. ఫరవాలేదు' అనుకున్నాను. బేరర్ని పిలిచి స్వీటు హాటు తెమ్మని పురమాయించాను.

టిఫెన్ తినటం పూర్తయింది. వేడి టీ చప్పరిస్తున్నాను. వాంగ్ యీచూ వచ్చాడు. "గది ఖాళీ అయింది. రండి పైకి వెళదాం," అన్నాడు.

చూ ముందు, వెనుక నేను మెట్లెక్కి, నాకోసం ఏర్పాటుచేసిన రూములో ప్రవేశించాము.

రూమ్ చిన్నదయినా బాగుంది. ఆ రూమ్ అంతకు క్రితం సామానుతో నిండిలేదని రూమ్ చూస్తూనే గ్రహించాను. చిన్న మంచము, ఓ ఛయిర్, స్టూలు, స్టూలుమీద మంచినీళ్ళ కూజా, డ్రస్సింగ్ టేబుల్, వంకెన వేలాడుతున్న టర్కీటవల్, రూమ్కి అందమైన కర్టెన్ వేలాడుతున్న చిన్న కిటికీ. అన్నివిధాలా నాకు అనువుగా వుందా రూమ్.

"నా కోసం శ్రమపడి నీట్ గా రూమ్ ఇచ్చారు. థాంక్స్" అన్నాను కోటు విప్పుకుంటూ.

"దానిదేముంది. మీరు డబ్బు పెట్టారు. ఈ మాత్రమయినా శ్రమపడి రూమ్ సర్ది ఇవ్వకపోతే మా మాట పోదా?"

స్త్రీ కంఠం విని గుమ్మంవైపు చూచాను.

"నా వైఫ్ చుంగ్ చాంగ్. శ్రమంతా ఆమెది," అన్నాడు చూ.

చూ భార్య చుంగ్ చాంగ్ కి ముప్పై ఏళ్లు ఉంటాయి. ఆమెని అందెకత్తెలతో పోల్చవచ్చు. చూ మాత్రం చూడటానికి వృధ్ధాప్యం మీద పడిన వాడిలా కాస్త వంగి,

కళ్ళకింద ముడతలు పడి వికారంగా ఉంటాడు. చాంగ్ ధృడంగా అందంగా ఆకర్షణీయంగా వుంది. చాంగ్, చూకి తగ్గ భార్య కాదనిపించింది.

“ఈ రాత్రికి నాకేం అవసరం లేదు. దండిగా టిఫెన్ తిన్నాను. అలసిపొయ్యానేమో నిద్ర ముంచుకు వస్తుంది. పడుకుంటాను. తెల్లవారిందాకా లేపకండి. నేనే లేచి గదిలోంచి బైటకు వస్తాను. అన్నట్టు...మీకు మళ్ళీ శ్రమ కలిగిస్తున్నాను. నా సైజు కొలతలు చెపుతాను. రేపు ఉదయం పది లోపల నే చెప్పినటువంటి డ్రస్‌లు ఖరీదైనవి రెడీమేడ్ షాపులో తెప్పించి ఇవ్వండి. డబ్బు గురించి ఆలోచించవద్దు ఎంతయినా సరే ఇస్తాను. అన్నట్టు ఇంకో విషయం. సాధారణంగా నా గది విడచి బైటికి రాను. ఎప్పుడయినా ఓసారి నా ఇష్టం వచ్చినప్పుడు అలా బైటికి వెళ్ళొస్తాను. మీల్స్‌కి, టిఫెన్‌కి మాత్రం కిందకొచ్చి వెళుతుంటాను. ఓకే. నాకు కావలసింది రూమ్. మీకు కావలసింది మనీ. ఆపై చెప్పవలసింది ఏమీ లేదు. గుడ్ నైట్.” అన్నాను నోటివద్ద చిటిక వేసుకుంటు ఆవులించి.

చూ, చూ భార్య చాంగ్ ముఖముఖాలు చూసుకున్నారు.

“గుడ్ నైట్,” గొణుగుతూ అని చూ, చాంగ్ బైటకు వెళ్ళిపోయారు.

తలుపులు వేసి గడియలు బిగించాను. నే తెచ్చిన సూట్‌కేసు తలగడపక్కనే ఉంచాను. లాగు జేబులో ఉన్న పిస్టల్ బైటకు తీశాను. తలగడకింద దాచాను. మంచమెక్కి తలగడమీద ఓ చెయ్యి ముడిచి చేతిమీద పడుకున్నాను.

చాంగ్, చూలు డబ్బు మనుషులు. ఇవాపై నా చేతిలో మనుషులు. అయినా, నా జాగ్రత్తలో నేను ఉండాలి. మేకప్ బాక్స్ నా సూట్ కేసులో ఉంది. దుస్తులు చూ చేత తెప్పించుకుంటాను. ఇంకేం కావాలి? చాంగ్ అవు లిస్తే పేగులు లెక్కపెట్టేటట్లుంది. జాగ్రత్తగా ఉండాలి. నే ఉన్న పరిస్థితి అలాంటిది.

ఆలోచిస్తూ కళ్ళు మూసుకున్నాను.

2

ఉదయం వాంగ్ యీ చూకి పదిహేను వందలిచ్చాను. రకరకాల డ్రస్‌లు కాక అవసరమయినవి కొన్ని లిస్ట్ రాసిచ్చి తెప్పించమన్నాను. ముఖ్యంగా నా రూమ్‌కి వేసుకోటానికి గోద్రెజ్ తాళంకప్పకూడా ఆ లిస్ట్‌లో ఉంది.

మార్నింగ్ టిఫెన్‌కి కిందకు వెళ్ళలేదు. మంచంమీద నుంచి లేవకుండానే, "టీ" ఒకటి పంపమని చెప్పాను చూకి.

చుంగ్ చాంగ్ కంగారుగా నా గదికి వచ్చింది.

"టిఫెన్ అక్కరలేదా? పోనీ ఇక్కడకు పంప మంటారా? ఆరోగ్యం సరీగాలేదా?" అని అడిగింది.

"ఈ పనికర్ ఉక్కుమనిషి. నా ఆరోగ్యానికొచ్చిన చింత ఏమీలేదు. దయచేసి నే పిలవంది తలుపులు తోసు కుని అలా నా రూమ్‌లోకి రాకండి" నిర్లక్ష్యంగా అన్నాను.

చాంగ్ ముఖం ముడుచుకుని అవతలికి వెళ్ళిపోయింది.

నాలో నేను నవ్వుకున్నాను.

ఓ గంట తరువాత చూ నాకు కావలసినవి తీసుకుని గది తలుపులు తోసి లోపలికి వచ్చాడు.

"మీరు లోపలికి వచ్చేముందు 'రావచ్చా?' అని ముందుగా నన్నడిగి రండి మిష్టర్ వాంగ్ యీ చూ!" అంటూ వార్నింగ్ ఇచ్చాను.

నేనున్న పరిస్థితులలో నా గురించి తెలుసుకోవాలని భార్యాభర్తలు ఇరువురు ప్రయత్నిస్తారు. నా గురించి ఒక్కముక్క తెలుసుకున్నా అదెంత ప్రమాదకరం? నా ప్రాణానికే ముప్పు!

"ఇహపై అడిగి లోపలకి వస్తాను" అన్నాడు చూ తెచ్చినవన్నీ నాముందు పెట్టి.

అన్నీ పరిశీలించి తృప్తిగా తల ఆడించాను.

"పాతిక రూపాయలు మిగిలాయి" డబ్బు నా ముందు ఉంచుతూ అన్నాడు చూ.

"మిగిలినవి తీసుకోవటం నాకు అలవాటు లేదు. ఇంకా డబ్బు పడితే ఇచ్చేవాడిని. సరే. ఇహ మీరు వెళ్ళవచ్చు. మీల్స్‌కి కిందకొస్తాను."

పాతిక రూపాయలు జేబులో కుక్కుకుని సంతోషంగా బైటకు వెళ్ళిపోయాడు చూ.

తలుపులు వేసి గడియ బిగించాను.

3

హోటల్‌కి వచ్చి నాలుగు రోజులయిపోయింది.

టిఫెన్‌కి, మీల్స్‌కి కిందకొచ్చి వెళుతున్నాను. మిగిలిన సమయమంతా గది విడిచి బైటకు రావటం లేదు. ఆ రోజు వార్నింగ్ ఇచ్చిన దగ్గరనుంచి అనవసర విషయాలు నన్నడగటంలేదు. అనుమతి లేనిది నా గదిలోకి దూరటం లేదు. ఏ రోజు రూమ్ రెంట్ ఆ రోజు ఇచ్చేస్తున్నాను. చూకి ఓ పక్క డబ్బు ముడుతున్నందుకు సంతోషం

మరో పక్క నన్ను చూస్తుంటే అయోమయంగాను ఉంది.

మీల్స్‌కి కిందకు వస్తూ నా గది తలుపులకు తాళం వేసి ఓ జేబులో వేసుకున్నాను. తాళం వేస్తున్న నన్ను చూచి పక్కగది గుమ్మంలో నుంచున్న చాంగ్ లోపలి కెళ్ళింది.

గదిలోంచి బైటకువస్తే తలుపుకి తాళం వేస్తున్నాను. మొదట్లో అది చూచి, "పైకి ఎవరూ రారు. గదికి తాళం వేయకపోయినా ఫరవాలేదు. నే చూస్తూంటాను" అంది చాంగ్.

"నా అలవాటు కేపసీ విరుద్ధంగా చేయను" అని గబగబ కిందకు వచ్చాను.

అప్పటినుంచి చాంగ్ గదికి తాళం వేస్తుంటే బైట నుంచున్నది కూడా లోపలికి వెళ్ళిపోతుంది.

నవ్వుకుంటూ కిందకు వచ్చాను.

యాభైమందికి సరిపడ ఛయిర్స్ ఉంటే ఆ ఛయిర్స్ సగం నిండగా ఎప్పుడూ చూడలేదు నేను. ఈ పూట మూడువంతులు ఛయిర్స్ నిండిపొయ్యాయి జనంతో. బేరర్స్ చకచక అటూ ఇటూ తిరుగుతున్నారు.

ఓ పక్కగా ఖాళీగా ఉన్న టేబుల్ వద్ద కూర్చున్నాను. ఎప్పుడూ నాకు సప్లయిచేసే బట్లర్ నాకు కావలసిన ఆహారం తెచ్చి నా ముందు ఉంచాడు. తల వంచుకుని తింటూ కూర్చున్నాను. నా టేబుల్‌కి అటువైపు కుర్చీలో ఎవరో కూర్చున్నట్లయి, తలఎత్తి చూచి, తిరిగి రుచిగల మాంసాహారం తినటంలో పడ్డాను.

చిన్న జిప్ బ్యాగ్ టేబుల్ మీద ఉంచి అతను కావలసినవి తెప్పించుకుని ఆతృతగా తినేసి, బిల్ చేతిలోకి తీసుకుని వెళ్ళిపోయాడు కౌంటర్ వైపు.

పదినిమిషాల తరువాత "టక్, టక్" తలుపు తడుతున్న శబ్దం వినవచ్చింది.

లేచి వెళ్ళి తలుపులు తీశాను.

వాంగ్ యీ చూ, అతని వెనుక భార్య చుంగ్ చాంగ్ నుంచుని ఉన్నారు.

"మీతో మాట్లాడాలి. గదిలోకి వస్తాము."

"ఇప్పుడా?"

"అవును. ఇప్పుడే. అర్జంట్ గా మాట్లాడాల్సిన పని ఉంది."

"ఒన్ మినిట్" అని వాళ్ళ ముఖానే తలుపువేసి లోన గడియ బిగించాను. లోపల సర్దవలసినవి సర్ది, పాంట్ జేబులో పిస్టల్ ఉంచుకుని తలుపులుతీసి, ఇరువురిని మర్యాదగా లోపలికి ఆహ్వానించాను.

"మీరు చేస్తున్న పనులేవీ మా కర్థంకావటం లేదు" ముఖం గంటు పెట్టుకుని చూ అన్నాడు.

"నా పనులు మీ కర్థంకాక పోవటంవల్ల నాకూ' మీకూ ఎటువంటి నష్టంలేదే? ముఖ్యమైన లెక్కకాగితాలు చూచుకుంటున్నాను. మీ రెందుకొచ్చారో చెపితే?"

"మా హోటల్ మంచి పేరుతో నాలుగు కాలాలపాటు ఉండాలా? అక్కరలేదా?"

"ఉండాలనే కోరుతున్నాను."

"మరి... ఇందాక మీరేం చేశారు? అతనెవరో జిప్ బ్యాగ్ వదిలి వెళితే అది మీరు పైకి తీసుకువచ్చారు. నే గమనించాను. అతనెవరో తరువాత వచ్చి, మీ హోటల్లో దొంగలున్నారు బ్యాగ్ పోయింది, అంటే హోటల్ అల్లరయిపోదా?"

"ఓస్. ఆ విషయం గురించా మీరు అడగటానికి వచ్చింది? అతను రాడు. వస్తే నా గదికి పంపండి, బ్యాగ్ ఇచ్చి పంపుతాను" గట్టిగా చెప్పాను.

"ఆ బ్యాగ్ నాకు ఇవ్వండి. అతనొస్తే నేనే అందజేస్తాను."

"మీకా శ్రమక్కర లేదు. వెళ్ళండి."

"మీ వరస నాకేం నచ్చలేదు" చాంగ్ అంది మధ్యలో కలగజేసుకుని.

"ఎందుకనో?" ఓరగా చూచాను చాంగ్ వైపు.

చాంగ్ మాట్లాడలేదు.

"నావల్ల మీ హోటల్ కి పేరు పోయినప్పుడుగాని, నేను ఏ రోజు రెంట్ ఆ రోజు ఇవ్వనప్పుడుగాని మీరు నాతో గట్టిగా మాట్లాడండి. మీకు కాని విషయాలలో మీరు తలదూర్చవద్దు. ఇహ మీరు వెళితే నా పని చూచుకుంటాను."

చూ, చాంగ్ లు ముఖముఖం చూచుకున్నారు. ఏమనుకున్నారో నెమ్మదిగా లేచి అయిష్టంగా గదిలోంచి బైటకు వెళ్ళారు.

4

తుపాకి తూటాలు కాలిపిక్కకు, జబ్బకు తగిలినచోట రక్తం కారకుండా, బనీనువిప్పి కాలికి కర్-చీఫ్ చేతికి కట్టాను. కుంటుకుంటూ హోటల్ లో ప్రవేశించాను. కోటు పాంటు ముదురు స్నఫ్ కలర్ వి కాబట్టి రక్తం అంటినా కనబడదు.

కౌంటర్ ముందున్న టేబుల్ పై చెయ్యి ఆనించి, "నా కోసం ఎవరయినా వచ్చారా మిస్టర్ వాంగ్ యూచూ?" అడిగాను.

"అదేమిటి కోటుమీద ఎర్రగా రక్తంలాగుంది? మీ ముఖం నీరసంగా వుంది? బజారు వెళ్ళివస్తానని చెప్పినప్పుడు బాగానే ఉన్నారే?" చూ కంగారుగా నన్ను పరీక్షగా చూస్తూ అడిగాడు.

"నే అడిగిందేమిటి? మీరు చెప్పేదేమిటి?" చూ ముఖంలో తీవ్రంగా చూస్తూ అడిగాను.

"అహా...ఆ...ఆ... మీరెళ్ళిన అరగంటకి ఒకతను వచ్చాడు. కుడికన్ను మెల్ల. పాలిపోయిన రంగుతో ఆరడుగు లెత్తునున్నాడు. మీ రూపం వర్ణించి... అతని పేరు పడేకర్. మీ హోటల్లో రూమ్ బుక్ చేసు కున్నాడా?" అని అడిగాడు.

"స్టుపిడ్" పిడికిలి బిగించి అన్నాను.

"ఆ?" చూ నోరు దాకలాగా తెరిచాడు.

"మిమ్మల్ని కాదు మిస్టర్ చూ! ఆ స్టుపిడ్ నన్ను వెతుక్కుంటూ వచ్చాడా? మీరేం చెప్పారు?"

"మీరు చెప్పమన్నట్లే చెప్పాను. కావాలంటే రూమ్స్ అన్నీ చూడండి, మీరు వర్ణించిన రూపం గల వారు ఎవరూ లేరు అన్నాను. అన్నట్లు అతను మీ పేరు పనికర్ అని కాక పడేకర్ అని ఎందుకన్నాడు?"

"యూడవను" గట్టిగా అని, పిడికిలి బిగించి బల్లమీద గుద్దాను.

బల్లమీద వస్తువులు ఎగిరిపడ్డాయి. చూ భయపడుతూ కుర్చీకి అతుక్కుపోయాడు.

"మీరొకసారి పైకి రండి మిస్టర్ చూ!" అని గబగబ నడవబోయాను మేడ మెట్లవైపు. కాలు పట్టేసింది. కాలు ఈడుస్తూ మెట్లు ఎక్కి నా రూమ్ చేరాను.

వాంగ్ యూచూ నా వెనుకనే వచ్చాడు మేడపైకి.

రూమ్‌లోకి రాంగానే పాంటు, షర్ట్, కోటు విప్పి మూలగా విసిరేశాను. గాయాలనుంచి రక్తం ఇంకా స్రవిస్తూనే ఉంది. బనీను, కర్‌చీఫ్ రక్తంతో తడిసి పొయ్యాయి.

"అదేమిటి?" చూ నన్ను చూస్తూ గాభరాగా అన్నాడు.

"కనపడటంలా రక్తం. లేచినవేళ బాగుంది. ఆ ఇడియట్, తుపాకీ కళ్ళుమూసుకు గురిచూచి కాల్చగలడు. కాని... ఈ పనికర్ కళ్ళు మూసుకుని తప్పించుకోగలడు. తుపాకీ గుళ్ళు శరీరంలోంచి దూసుకుపోలేదు. రాచుకుంటూ పోయాయి. ఫరవాలేదు. ఇది నాకో లెక్క కాదు," కాటన్‌తో రక్తం తుడుచుకుంటూ అన్నాను.

"అసలు తుపాకీ ఎందుకు కాల్చారు? ఎవరు కాల్చారు? నాకేం అర్థంకావటం లేదు."

"కొన్ని విషయాలు అర్థం కాకపోవటం, మరికొన్ని తెలుసుకోకపోవటం మంచిది" కఠినంగా అన్నాను.

వాంగ్ యీ చూ నిర్ఘాంతపోయి అలా నిలబడి పొయ్యాడు.

తాపీగా గాయం చుట్టూవున్న రక్తం తుడుచుకుని, గాయంమీద మందు, కాటన్ గాజుగుడ్డ వేసి, డ్రస్ చేసేశాను. తొడకి నేనే ఇంజక్షన్ చేసుకున్నాను. లుంగీ, పల్చని షర్ట్ ధరించి చూ వైపు తిరిగాను. "వేడి టీ ఓ కప్ పంపించండి" అన్నాను మంచంమీద కూర్చుని.

"నన్నెందుకు పిలిచినట్లు రమ్మని?"

"టీ తాగి చెపుతాను."

మారు మాట్లాడకుండా చూ కిందకు వెళ్ళాడు. టీ

కష్టంతో పదినిమిషాలలో లోపలికి వచ్చాడు.

"మీ కోసం మళ్ళీ ఎవరో వచ్చారు. మా హోటల్లో మీరు చెపుతున్న ఆనవాళ్ళు పేరుగల ఎవరూ లేరంటే నమ్మటంలేదు. తన పేరు రతన్ అని చెప్పాడు. పైగా రతన్ అనే అతనొచ్చాడని పనికర్‌తో చెపితే చాలు రమ్మంటాడని కూడా అన్నాడు" చూ వివరంగా చెప్పాడు.

"ఊహూ, నే అనుకున్న దానికన్నా ముందే వచ్చేశాడన్నమాట. గుడ్. వెంటనే వెళ్ళి రతన్‌కి పైకి పంపండి" అన్నాను.

చూ వెళ్ళిపోయాడు కిందకు.

రతన్ గదిలోకి రాగానే తలుపు వేసి గడియ బిగించాడు.

నేనేం మాట్లాడలేదు.

"నీ విక్కడున్నట్లు నే ఊహించటంలో ఎంతమాత్రం పొరపడలేదు. ఎక్కడో ఉండవలసినవాడివి చివరికి ఇక్కడ తేలావా పడేకర్?" అన్నాడు రతన్.

"నాపేరు పడేకర్ కాదు పనికర్."

"ఓహో, పేరుకూడా మారిందన్నమాట!"

"అవసరాన్నిబట్టి అన్ని మారిపోతాయి. నే యిక్కడున్నట్లు ఎవరు చెప్పారు? నన్ను వెతుక్కుంటూ ఎందుకొచ్చావ్? మళ్ళీ మనీ కోసమేనా? నీ శ్రమకి ఫలితం ఎప్పుడో అందజేసాను. పిచ్చిగా మళ్ళీ పచ్చనోటు అడక్కు. పదినిమిషాలలో పరలోకయాత్రకు సిద్ధం చేస్తాను నీ దేహాన్ని."

"నువ్వెంతటి ఘనుడవని తెలుసు పడేకర్, నాకు కావలసింది పచ్చనోటు కాదు."

"మరి...?"

"చంద్రమణి... నీలికాంత... పుష్యరాగం. ఇంకా పేర్లు చెప్పనా?" రతన్ వ్యంగ్యంగా అన్నాడు.

"గెటవుట్" కోపంగా పెద్దపెట్టున అరిచాను.

"అరిస్తే నీ నోరే నొప్పి పుడుతుంది. కోపం తెచ్చుకుంటే నీ గుట్టు బైటపడుతుంది" రతన్ బెదిరింపుగా అన్నాడు.

రయ్యిన మంచం మీదనుంచి లేచాను. సింహంలా రతన్ మీదకు దూకి ఓ చేత్తో తలుపు గడియ తీశాను. రతన్‌ని లాగి గదిలోంచి బైటకు తీసుకువచ్చాను. "మరో సారి నా కంటపడ్డావా? నీ బాబు పోయిన చోటుకి పంపుతానురా బద్‌మాష్, నా పేరు, నా ఉనికి, అదే ఇందాక చూశావ్ వాటి సంగతి అన్నీ మరచిపో. నిన్ను చంపటానికి కత్తి, తుపాకీ అక్కరలేదురా నా ఎడంచేతి చిటికినవేలి గోరు చాలు" అని మెడపట్టి మెట్లవైపు ఓ గెంటు గెంటాను.

రతన్ నా తోపిడికి విసురుగా పడబోయి మేడ మెట్ల పక్కనున్న మెష్ పట్టుకుని నిలతొక్కుకున్నాడు. వాడు కసితీర నాలుగయిదు బండబూతులు తిట్టి వెళ్ళిపోయ్యాడు.

గిరుక్కున వెనుతిరిగాను.

వాంగ్ యీచూ, భార్య చింగ్ చాంగ్ గోడపక్కగా ఒదిగి నుంచుని ఉన్నారు.

"మీ రిక్కడేం చేస్తున్నారు?" గర్జించి అడిగాను.

చూ తడబడ్డాడు.

చాంగ్ మటుకు "మీ గదిలో పెద్దగా మాటలు వినిపిస్తూంటే ఏమిటో అని వచ్చాము" అంది.

"మంచిది. ఇక్కడేం ఘోరం జరగలేదు. పిచ్చికుక్క వస్తే వెళ్ళగొట్టాను. ఇంక మీరు వెళ్ళవచ్చు" అని గదిలోకి వెళ్ళాను. నా వెనకనే చూ, చాంగ్ వచ్చారు.

"మీకూ మీ డబ్బుకి నమస్కారం. మీవల్ల మేము, మా హోటలు రచ్చకెక్కేటట్లున్నాం. మీరు వేరే హోటల్ చూసుకోండి" అన్నాడు చూ.

"రతన్‌గాడికి నాకు ఎందుకు పోట్లాట వచ్చిందో మీకు తెలియదు. నా ప్రవర్తన కాదు మీరు చూడవలసింది. మీ ప్రవర్తన నాకు నచ్చలేదు. ఇలా మీరు చాటుగా పొంచుండి నా మాటలు వినటం ఏమిటి? రూమ్ ఇచ్చారు. రెంట్ పారేస్తున్నాను. మంచిది. నాకు ఈ రూమ్‌లో ఉండే యోగం నిండా పదిహేను రోజులు కూడా లేదన్నమాట... నాకు రూమ్ ఇచ్చినందుకు వెళ్ళేటప్పుడు మంచి విలువైన బహుమతి ఇచ్చిపోదామనుకున్నాను. ప్చ్. ప్రాప్తంలేదు మీకు. ఓ. కే. రేపు రాత్రిలోగా వేరే రూమ్ చూసుకుని వెళ్ళిపోతాను."

వాంగ్ యీచూ కంగారుగా చేతులతో వారిస్తూ నా ముందుకు వచ్చాడు.

"పోట్లాటలంటే భయం, అందుకని కాస్త గట్టిగా చెపుదామని వచ్చాను. మీరు రూమ్ ఖాళీచేసి పోవద్దు" అన్నాడు చూ.

"నెల కాకపోతే నాలుగు నెలలుండండి" నమ్రతగా అంది చాంగ్.

"నేను రతన్ మాట్లాడుకుంది మీరు విన్నారా?"

"ఊహూ."

"సరే, రూమ్ ఖాళీ చేయను. మీకు కావలసిన డబ్బు ఇస్తాను. నా విషయం ఏదీ పట్టించుకోకండి. అది మీకూ

నాకూ మంచిది. మీలయితే నాకు సాయం చేయటానికి ప్రయత్నించండి. ప్రతిఫలం బాగా ముట్టచెపుతాను. ఇహ మీరు వెళ్ళవచ్చు'' అన్నాను.

''మీ విషయం పట్టించుకోము. గోలలేవీ జరగకుండా చూడండి. అదే మాకు కావలసింది'' చూ అన్నాడు.

తల ఊపాను, సరే అన్నట్లు.

వాంగ్ యీచూ, చింగ్ చాంగ్ రూమ్‌లోంచి బైటకు వెళ్ళిపోయ్యారు.

5

రాత్రి పదిగంటలయింది.

మీల్స్ తీసుకోంగానే విశ్రాంతిగా పడుకుని, పుస్తకం గాని, పేపర్ గాని, ఓ గంట తిరగేసి నిద్రపోవటం ప్రశాంతంగా ఉన్నప్పుడు అలవాటు.

టేబుల్ లైట్ తలవద్ద బల్లమీద పెట్టుకుని న్యూస్ పేపర్ తిరగేస్తున్నాను. నిద్ర ముంచుకొస్తున్నది.

''వద్దు, వద్దు. అనుమతి లేనిదే లోపలికి వెళితే కోప్పడతారు. నీకే చెప్పేది'' రూమ్ బైటనుంచి వాంగ్ యీచూ మాటలు గాభరాగా వినవచ్చాయి.

పక్క గది తలుపు తీసిన చప్పుడయింది. అంటే చూ భార్య చాంగ్ తలుపులు తీసుకుని గది బైటకు వచ్చి వుంటుంది.

''నా సంగతి తెలియదు. తలుచుకున్నానంటే నల్లిని నలిపేసినట్లు నలిపేయగలను. పేను కుక్కినట్లు కుక్కగలను. చెయ్యి వదులు. వాడి ముఖం వాడు నన్ను కొప్పడేంతటి మొనగాడా?''

నల్లి, పిల్లి, పేను మొదలైన పేర్లు తరుచు ఎవరు వాడుతారో గుర్తొచ్చింది. ఆ కంఠస్వరం గుర్తించాను. చటు

క్కడన లేచి దిండుకింద పిస్టల్ ని జేబులో వేసుకున్నాను. పిస్టల్ ఉన్న జేబులో చెయ్యిపెట్టి, లేచి నుంచున్నాను.

వాంగ్ యీ చూని తోసిపారేస్తూ లల్లూరాం నా రూమ్ లోకి జొరపడి, గుమ్మంలో ఆగిపోయ్యాడు.

నిద్ర పోయేటప్పుడు తలుపు లేసుకోవచ్చని తలుపులు బార్లా తెరిచి ఉంచాను. అందువల్ల లల్లూరాం నా రూమ్ లోకి రాగలిగాడు.

"అచ్ఛా భాయ్! కష్టం లేకుండా నే కనపడ్డావు. పని కూడా అలాగే పూర్తి అయితే బాగుంటుంది కదూ?" లల్లూరాం అన్నాడు.

లల్లూరాంవైపు కోపంగా చూడటం తప్ప, ఏమీ మాట్లాడలేకపోయాను.

"ఉన్నట్లుండి ఇలా ముఖాముఖీ వచ్చి మాట్లాడుతానని మాట్లాడుకోలేదు కదూ భాయ్?"

అప్పటికి నేను పెదవి కదపలేదు. చూ వైపు చూచాను.

"మేడపైన ఎవరూ లేరని చెప్పినా వినకుండా, నాకు కావలసినవాడొకడున్నాడు. వాడి పేరు పనికర్ లేక పడేకర్ కావచ్చు. అసలు పేరు ఆ రెండూ కాదు. వాడి రూపం చూచి పేరు చెపుతాను, అంటూ నా మాట ఖాతరు చేయక మేడపైకి వచ్చేశాడు," తన తప్పేం లేదన్నట్లు చూ అన్నాడు.

"బాగుంది భాయ్! పనికర్, పడేకర్ మంచి పేర్లే ఎన్నుకున్నావు. శోభనాద్రి, శంకర్రావ్ పేర్లు మోటుగా ఉన్నాయనా? ఈ పేర్లు తగిలించుకున్నావ్?"

"లల్లూరాం! ఇది ఎగతాళికి సమయంకాదు. నువ్వెక్కడ

దిగావో చెప్పు, రేపు అక్కడికి వస్తాను. మాట్లాడు కుందాము,'' శాంతంగా అన్నాను.

లల్లూరాం పెద్దపెట్టున నవ్వాడు.

''అరె భాయ్! నీ సంగతి నాకు తెలియదా? నీటిలో మొసలివి. కలుగులో ఎలుకవు. మూలనున్న తేలువు. క్షణం కన్ను మూస్తే పాతిక మైళ్ళు దాటిపోతావు. నేను దిగిన చోటు చెపితే నా దగ్గరకు వస్తావా? ఏం వినయం? ఏం వినయం? బాగుంది. మంచి ప్లేస్ ఎన్నుకున్నావు. అందుకే నీ వెనుక బైలుదేరిన నేను నిన్ను పట్టటానికి పది హేను రోజులపైనే పట్టింది. అసలు విషయానికొద్దాము. నీవూ నేనూ భాయ్ భాయ్‌గా ఉంటే అగ్నికి వాయువు తోడయినట్లుంటుంది.''

''ఊహూ, నిప్పుమీద పడ్డ ఉప్పులా ఉంటుంది,'' చిటపటలాడుతూ అన్నాను.

''అ తొందరే మంచిది కాదు. ఇప్పటికే ఆ రహస్యం చాలామందికి తెలిసిపోయింది.''

''నాకేం భయంలేదు. వందమందికి తెల్సినా నన్నేం చేయలేరు.''

''ఫూల్‌లా మాట్లాడకు. మనిద్దరం కలిస్తే మూడో వాడిని పట్టటం తేలిక. అప్పుడు కోట్లు మనవి.''

''ఉష్! నీతో నే కలవటంవల్ల కావాలని చేటు తెచ్చు కోటం. నీ దోవన నీవు ప్రయత్నించు. నా దోవన నేను ప్రయత్నించుతాను. ఎవరికి ముందుగా మైకేల్ దర్శన మిస్తాడో, వాడి పంట పండినట్లే. నీ కంటపడ్డా నా కంట పడ్డా మైకల్ ప్రాణంతో ఉండడు. నెక్స్ట్... మైకల్ వద్ద దాగిన రహాశ్యం తెలుసుకున్నవాడే మరకత మాణి

క్యాలకు అధిపతి. నాకే ఆ యోగం ఉంటుందనుకుంటున్నాను. నా దోవకి అడ్డం రాక నీ ప్రయత్నం నీవు చేసుకో. నీ ముఖానికి ఆ యోగ్యత పడుతుందేమో?" వ్యంగ్యంగా, నిర్లక్ష్యంగా తల ఎగరవేస్తూ అన్నాను.

లల్లూరాం చటుక్కున కోటు జేబులోంచి పిస్టల్ తీశాడు. నాకు గురి పెట్టాడు.

"నీవద్ద ఉన్న ప్లాన్ ఇస్తావా? స్వర్గానికి పంపనా? రెండే నిమిషాలు. జవాబివ్వు."

"ప్లాన్ కాగితం దగ్గరుంచుకుంటానని ఎలా అనుకున్నావ్? నీ తెలివి ఏడ్చినట్లే ఉంది. నన్ను చంపితే ఇటు కాగితము దక్కదు, అటు మైకేల్ గాడు అందడు. చూ! అతన్నేమీ చేయకు. ఉత్త బెదిరిం..."

నా ట్రిక్ పనిచేసింది. లల్లూరాంతో మాట్లాడుతూ, మధ్యలో లల్లూరాం వెనకగా ఉన్న వాంగ్ యూచూతో గాభరాపడుతూన్నట్లు, అన్నాను.

లల్లూరాం గిర్రున వెనుతిరిగాడు. చటుక్కున పాంట్ జేబులో పిస్టల్ తీసి "ధన్, ధన్," మంటూ లల్లూరాంని కాల్చాను. లల్లూరాం మొదలు నరికిన వృక్షంలా బోర్లా పడిపోయ్యాడు. వీపులోంచి రక్తం కాలువలా వచ్చింది. సైలన్సర్ అమర్చిన పిస్టల్ కాబట్టి "సర్, సర్" అని చిన్న శబ్దం మాత్రమే అయింది.

చూ 'కెవ్' మని కేక వేశాడు. నా పిస్టల్ వాంగ్ చూ వైపు తిప్పాను.

"మిస్టర్ వాంగ్ యూచూ! నోరు మూసుకుని, చేతులు పైకెత్తి లోపలికి రా. ఏయ్! చాటుగా ఉన్న శ్రీమతి చింగ్ చాంగ్, నువ్వూ ఇలా వచ్చెయ్యి, ప్రాణాలమీద ఏమాత్రం తీపి ఉన్నా" అన్నాను కరుగ్గా.

వాంగ్ యీచూ, చింగ్ చాంగ్ భయపడుతూ రూమ్ లోపలికి లల్లూరాం శవాన్ని దాటుకు వచ్చారు.

"చూ! ఈ శవాన్ని మాయం చేయాలి. నాతో చేతులు కలపండి, ఎంత డబ్బయినా ఇస్తాను. తగలాల్సిన చోటే తగిలి చచ్చాడు ముండాకొడుకు."

"ధనమంటే ఆశయినా, ఇలా హత్యలు అవి దాచి సాయం చేయలేము. నావల్ల కాదు. సాయం చేసినట్లే చేసి, నిన్ను పోలీసుల కప్పగిస్తే ఏంచేస్తావ్?" ఓ పక్క భయంభయంగా పిస్టల్ వైపు చూస్తూ అన్నాడు చూ.

చుంగ్ చాంగ్ దోసిట్లో ముఖం దాచుకుని ఏడ్వటం మొదలు పెట్టింది. అయితే ఏదో చిన్నగానే ఏడుస్తున్నది.

"పోలీసులకి నన్నప్పగిస్తావా? మంచిది మిష్టర్ వాంగ్ యీచూ! పోలీసు డిపార్ట్మెంట్ అంటే ఏమిటి? అధికారంలో ఉన్న దొంగలు వాళ్ళు. లైసన్సు బిళ్ళలేని దొంగలం మేము. వాళ్ళకీ మాకూ అంతే తేడా? అసలు విషయం టూకీగా చెపుతాను. నా పేరు పనికర్ కాదు, అసలు పేరు చెపితే హడిలిచస్తావ్! కాబట్టి నా పేరు అడగకు. పనికర్ అంతే. నేను ఈ ఊరు వంటరిగా రాలేదు. నా వాళ్ళు పాతికమంది దాకా వివిధ వేషాలలో ఈ రంగూన్ పట్టణంలో రకరకాల వృత్తులలో ఉన్నారు. ప్రతిరోజు రెండో కంటికి తెలియకుండా ఒకరి సమాచారం ఒకరు తెలుసుకుంటాము. నా ఆచూకీ, నా రహస్యం పోలీసులకు చెప్పి నన్ను జైలుపాలు చేయటం నీకు ఈజీ మరి తర్వాత సంగతి? నా వాళ్ళు ఊరుకోరు. నన్ను జైలు నుంచి తప్పిస్తారు. ఈ లోపలే నీది, నీ భార్యది, శరీరాన్ని అంగుళం, అంగుళం ముక్కలుగా కోసి కైమా చేసి నా

మిత్రబృందం అరగిస్తారు. ఓకే, పోలీసులను పిలువు నాకేం భయంలేదు."

వాంగ్ యీచూ, చింగ్ చాంగ్ ముఖముఖాలు చూచు కున్నారు.

"చైనీస్ భాష వచ్చా?" అన్నాడు చూ.

"చైనా వెళ్ళే అవసరం వచ్చిన మర్నాడు నేర్చు కుంటాను. అయినా ఇప్పుడా విషయం దేనికి?"

వాంగ్ యీచూ జవాబు చెప్పలేదు. భార్యవైపు తిరిగి చైనిస్ భాషలో సంభాషణ మొదలుపెట్టాడు. చూ, చాంగ్ పదినిమిషాలు మాట్లాడుకున్నారు చైనిస్ భాషలో. తరువాత నావైపు తిరిగాడు చూ.

నాకు చైనిస్ భాష వచ్చు. కాని, వారు మాట్లాడు కుంటున్నది అర్థంకానట్లు మొహంపెట్టాను.

"నాకు తెలియని భాషలో మాట్లాడుకుని గూడు పుఠాణీ చేస్తున్నారా?" కోపంగా అడిగాను.

"నా మాట కాదనకుండా ఉంటే మీ ఇష్టంవచ్చినట్లు చేస్తాను" చూ అన్నాడు.

"ఓ. కే. డబ్బు గురించేనా? ఎన్ని వేలు కావాలి?"

"డబ్బు కాదు."

"మరి?"

"మీ మధ్య ఉన్న రహస్యం ఏమిటి? మైకేలు, లల్లూరాం ఒకరికోసం ఒకరు ఎందుకు వెతుకుతున్నారు?"

కాసేపు దీర్ఘంగా ఆలోచించాను.

"మిష్టర్ వాంగ్ యీచూ! టూకీగా రెండు ముక్కలు చెపుతాను. ఆ విషయం వెంటనే మరచిపో. అలా మరచి పోవటం నీ ప్రాణానికే మంచిది. నేను, మైకేలు, లల్లూ రామ్, కొంతకాలం క్రితం ప్రాణమిత్రులం. ఓ సందర్భంలో

నిధి రహస్యం ఒకటి మాకు తెలిసింది. ఆ నిధిని పొందాలంటే ముగ్గురం ఓ మాటమీద ఉండాల్సింది. ఎవరికివారం విడిపొయ్యాము. గర్భ శత్రువులం అయాము. ఎవరికివారం మందిమార్బలం పోగుచేసుకున్నాము.

ఇదిలా ఉంటే మరో చిక్కు వచ్చింది. నిధిని స్వంతం చేసుకోవాలంటే ముగ్గురం కలవాలి. మా ముగ్గురివద్ద ఉన్న ఆ రహస్యం ఒకేచోట చేర్చితేగాని, నిధిని పొందలేము. మేము మళ్ళీ ప్రాణమిత్రులం కాదలుచుకోలేదు. ఒకరినొకరు చంపి ఆ రహస్యం సొంతం చేసుకోవాలని, ముగ్గురం మారువేషాలలో ఉండి సమయం కోసం ఎదురు చూస్తున్నాము.

మైకేల్ గాడు మూడుసార్లు నా చేత వెంట్రుకవాసిలో ప్రాణం తప్పించుకుని మా ఊరినుంచి పారిపొయ్యి ఈ రంగూన్ వచ్చాడు. వాడిని తరుముతూ నే వచ్చాను. నన్ను తరుముతూ లల్లూరాం వచ్చాడు. లల్లూరాం అనుచరులను నా మీదకు తోలాడు. లాభం లేకపోయింది. తానే బెలుదేరి వచ్చాడు. చచ్చాడు. వీడి అనుచరులను నావైపు తిప్పుకుని లల్లూరాంవద్ద దాగింది బైటకు లాగుతాను.

పోతే, మైకేల్, వాడు ఎంతకాలం మారువేషాలతో మారుమూలలు దాగి నా కళ్ళు కప్పి తిరుగుతాడు? ఓసారి కొట్టిన దెబ్బకు మూతి పళ్ళు ముందు రెండూ ఊడి కింద పడ్డాయి. మూడో పన్ను కూడా ఊడినట్లయితే మోజుపడి కట్టించుకున్న బంగారుపన్ను కూడా ఊడి కిందపడేది. తొర్రి వెధవ.

ఈ రంగూన్ మారుమూలల్లో వాడెక్కడ దాక్కున్నా వెతికి యమలోకానికి పంపకపోతే నా పేరు సాహూచం" ఆవేశంతో చెప్తున్న నేను చటుక్కున నోరు మూసు

కున్నాను.

"మైకేల్ ఎలా ఉంటాడు?" వాంగ్ యీ చూ అడిగాడు.

"పొట్టిగా; బూడిదపట్టిన గుమ్మడికాయలా ఉంటాడు. మిడిగుడ్లు, ముందు రెండు పళ్ళూ లేవు. ఎడంకాలు ఎత్తి ఎత్తి నడుస్తాడు. ఏం? మైకేల్ గాడు కనపడితే చెయ్యి కలపాలనా?"

"ఉహూ, ఊరికే అడిగాను."

"నాతో చెయ్యి కలుపు. నీ ప్రాణంలా నన్ను చూసుకో. లక్షాధికారిని చేస్తాను మిస్టర్ చూ! లక్షలు నాకో లెక్క కాదు. నాకు కావలసింది అది... అది... నా రహస్యం చెప్పాగాబట్టి ఈ నిమిషంనుండి నాకు నీవు ప్రాణమిత్రుడివి. గర్భశత్రువ్వి. ముద్దుకు ముద్దు. గుద్దుకు గుద్దు. ఓకే, గుర్తుంచుకుని మెలుగు. ఇప్పుడు ఈ అల్లూరాంని ఎలా మాయం చేద్దామంటావు మిస్టర్ చూ?"

"ఆ పని నాకు వదిలెయ్యండి."

"నో. నో, ఏ పనిచేసినా నాతో చెప్పాలి. నా కళ్ళ ముందు జరగాలి."

"మా హోటల్లో పలురకాల మాంసాహారం ఉంటుందని మీకు తెలుసుగా? ఈ శవాన్ని ముక్కలు ముక్కలుగా తురమటం మాంసంలో గుచ్చెత్తటం, ఆ తర్వాత అది ఘుమఘుమలాడే కూరలుగా మారిపోతుంది. ఎముకలను ముక్కలుచేసి గొర్రెలు, చేపలు, మేకలు, పందులు, పడేసే బొమికలు, చర్మాలు ఉంచే వేస్ట్ డ్రమ్‌లో వీడి బొమికలు పడేయటం. వేస్ట్ డ్రమ్‌ని ఎవరూ చూడరు.

డ్రమ్ము మూతతో సహా ఉంటుంది. దానిని ఉదయమే ఖాళీ బండి వచ్చి తీసుకెళుతుంది. బొమికలను మురుగునీరు పోయే కాలవలో బోర్లిస్తారు.

మురికినీటి కాల్వలో కొట్టుకుపోతాయి బొమికలు. ఖాళీ డ్రమ్ తిరిగి క్షేమంగా వస్తుంది. దీనిలో ఏమీ ప్రమాదం లేదు.''

''మాంసం మనిషిదనిగాని, లేక మనం చేసే పని హోటల్ కుక్స్‌గాని, బేరర్స్‌గాని కనిపెడితే, మొదటికే మోసం వస్తుందే? పోనీ ఓ పని చేద్దాం. ఖాళీ పెట్టె ఉంటే చూడు. లేకపోతే తెప్పించు. వీడిని దానిలో పెట్టి నా అనుచరులకు అప్పగిస్తాను. చేయవలసింది వారే చేస్తారు.''

''మీరు చెప్పిందానికన్నా నే చెప్పింది చేయటమే క్షేమం. మాంసంకొట్టు నా అధీనంలో ఉంటుంది. పైనే మన పని ముగించి బొమికలను, మాంసాన్ని చేర్చవలసిన చోటుకి చేరుద్దాం.''

''సరే, కాని అంతపనీ నా కళ్ళ ఎదుట జరగాలి. ప్రస్తుతం చేయవలసింది _ నాకు కావలసింది వీడివద్ద ఉన్నదా? లేక వీడు దాగున్న చోట ఉన్నదా? వెతకాలి.''

వాంగ్ యూచూ, అల్లూరాం శవాన్ని చూస్తూ ఉండి పోయ్యాడు.

నేను అల్లూరాం వద్దకు వెళ్ళి పక్కనే కూర్చున్నాను. ముందుగా కాలి బూట్లు ఊడదీశాను. మేజోళ్ళు తీశాను. పరీక్ష చేశాను. బూటు మడమలలో పాయిజన్‌ది చిన్న బాటిల్, సిరంజీ, నిడిల్ ఇంజక్షన్‌ది దాచి వుంచె. యథా ప్రకారం బూటు తొడిగాను. పాంటు కోటు జేబులు

వెతికాను. తలమీద జుట్టు అటూ ఇటూ చెరిపి చూచాను. నిట్టూర్పు విడిచి లేచి నుంచున్నాను.

చచ్చిపోయిన లల్లూరాం ముఖం భయంకరంగా ఉంది. ముఖాన టవల్ కప్పాను.

నా పిచ్చిగాని రహస్యంని రహస్యంగానే దాస్తారు. వెంట తెచ్చుకోరు.

"ముందు మీ ఇంట్లో ఏ పెట్టయినా ఉంటే చూడండి మిస్టర్ చూ! వీడిని దానిలో పెడదాం. తరువాత మావా డొకడికి ఫోన్ చేయాలి. వాడు ఈ నిమిషంనుంచే పని మొదలు పెడతాడు. లల్లూరాం ఎక్కడ దిగింది తెలుసుకుం టాడు. లల్లూరాం దగ్గరవుంది తెలుసుకోందే,ముక్కలుగా నరికామా? అది వీడి శరీరంమీదే ఉంటే నాశనం అవు తుంది. ఇహ ఎప్పటికీ నేనేం చేయలేను. అదంతే భూ స్థాపిత మౌతుంది," అన్నాను.

"అలా అయితే పెట్టె వుంది తీసుకు వస్తాను. దానిలో శవాన్ని పెడదాము. మీరు ఫోన్ చేద్దురుగాని," చూ అన్నాడు.

"అలాగే."

చూ, చాంగ్, ఒకరి వెనుక ఒకరు బైటకు వెళ్ళారు. లల్లూరాంని చూస్తూ కూర్చున్నాను. నా ఆలోచనలు పరి పరి విధాలా పోతున్నాయి.

చూ, చాంగ్ లు పొడుగాటి కొయ్యపెట్టె మోసుకుని వచ్చారు. నేనూ, చూ కలిసి, లల్లూరాంని పెట్టెలో పెట్టి మూత వేశాము.

"కిందకు వెళ్ళి ఫోన్ చేద్దాము పదండి," అన్నాను.

చూ, చాంగ్, నేను రూమ్‌లోంచి బైటకు వచ్చాము. రూముకి యథాప్రకారం తాళం వేశాను.

"అదేమిటి, పది నిమిషాలలో ఫోన్ చేసి వస్తాము. తాళం దేనికి?" వాంగ్ యీచూ అన్నాడు.

"తాళం వేయకుండా రూమ్ దాటి నాలుగడుగులు వేయటం ఎప్పుడయినా చూచారా? ఇది నా అలవాటు. నా అలవాటుకి విరుద్ధంగా ఏ పనీ చేయను. బద్ధకించటం అజాగ్రత్త నాకు ఎలర్జీ" అంటూ జేబులో కీ వేసుకుని కిందకు బైలుదేరాను.

నాతోపాటు, చూ, చాంగ్ లు కిందకు వచ్చారు.

క్రెడిల్ మీదనుంచి రిసీవర్ అందుకుంటుంటే చూ, చాంగ్ లు నా పక్కనే నుంచున్నారు.

6

పడుకుని ఆలోచిస్తున్నాను. తలుపుపై "టిక్, టిక్" అనిన శబ్దం వినవచ్చింది.

చటుక్కున లేచి కూర్చున్నాను.

మళ్ళీ తలుపు తట్టిన శబ్దం వినవచ్చింది.

"ఎవరు?" చేతిలోకి పిస్టల్ తీసుకుని అడిగాను.

"నేనే వాంగ్ యీచూని తలుపు తియ్యండి."

వెళ్ళి తలుపు తీశాను.

వాంగ్ యీచూ చేతిలో నల్లగా నిగనిగలాడుతూ పిస్టల్ ఉంది. అది నావైపు గురి పెట్టబడి ఉంది.

పిస్టల్ పుచ్చుకున్న నా చేతిని పైకి ఎత్తాను.

"ఏమిటి నీ ఉద్దేశ్యం?"

"జాగ్రత్తకోసం. అంతే. మీతో ముఖ్యమైన విషయాలు మాట్లాడాలి."

"దానికేం మాట్లాడవచ్చు. నేముందే చెప్పాగా ముద్దుకు ముద్దు, గుద్దుకు గుద్దు, నా సిద్ధాంతం అని."

"నే చెప్పబోయేది ముఖ్యమైనది. ప్రాణాలతో పని," చూ అన్నాడు.

"ముఖ్యమైన విషయమైనా, ప్రాణాలతో చలగాట మయినా మన మధ్య పిస్టల్ ఉండరాదు మిస్టర్ చూ? నిన్ను నే నమ్మాను, నన్ను నీవు నమ్ము అంతే. ఇదిగో నా పిస్టల్ పక్కన పడేస్తున్నాను. నీవు పక్కన పడేసి సావధానంగా మాట్లాడవచ్చు," నా పిస్టల్ని మంచంమీదకు విసిరేసి అన్నాను.

"నే నీతో మాట్లాడినంత సేపు నా చేతిలో పిస్టల్ ఉంటే అభ్యంతరమా?"

"నాకేం లేదు. కాని...నీవు చూడబోతే ఉజ్జీవి కాదని పిస్తుంది." అంటూ ఛయిర్ లాక్కుని కూర్చున్నాను.

చూ ఎదురుగా కొద్దిదూరంలో నుంచున్నాడు చేతిలో పిస్టల్ ఉంచుకునే.

చూ ఎంతో అవసరం అయితే తప్ప నామీద పిస్టల్ ప్రయోగించడు. ఆ నమ్మకం వుంది.

"మైకేల్ నాకు తెలుసు" నా కళ్ళల్లోకి గుచ్చి చూస్తూ అన్నాడు చూ.

"ఆ!"

"ఎందుకంత ఆశ్చర్యపోతావ్? సరీగా నీవు చెప్పిన గుర్తులు గలవాడే మైకేల్ అయితే వాడెక్కడికీ పోలేదు. ఉన్నాడు."

"ఎక్కడ?"

"స్వర్గానికెళ్ళే దారిలో, మైకేల్ సంగతి మరచిపో; మైకేల్ వద్ద ఏం దాగుందో చెప్పు!"

"నే చెప్పను. పిచ్చిగా మాట్లాడుతున్నావ్, చూ" కోపంగా అన్నాను.

"పిచ్చిగా మాట్లాడటంలేదు. నీవద్ద రహస్యం ఉంది. చచ్చిన లల్లూరాంవద్ద రహస్యం ఉంది. రెండు ఒకటై నీ దగ్గర చేరుతాయి. నీ సొంతం అవుతాయి. అయినా మైకేల్ వద్దది కూడా కలిస్తేగాని పని పూర్తికాదు. అవునా?"

"అవును" అసహనంగా అన్నాను.

"నేనే మైకేల్ ననుకో. ఏంకావాలి?"

"ఇస్తావా, ఏ దడిగినా?"

"ఆఁ."

"నీవు మైకేల్ వికాదు! మైకేల్ శరీరం కావాలి. అతని వస్తువులు కావాలి."

"అన్నీ ఆధీనంచేస్తే నా అవసరం నీకుండదు. కాబట్టి మైకేల్ వద్ద దాగిన రహస్యం చెప్పు. నీ రహస్యం నీ దగ్గర ఉంచుకో. అప్పుడు ఇరువురం సమ ఉజ్జీ లవుతాము."

"మిష్టర్ చూ! నీవు చాలా తెలివిగలవాడివి. నావద్ద, మైకేల్ వద్ద, లల్లూరాంవద్ద మూడు తాళంచెవి ఆకారం గల బిళ్ళలున్నాయి. ట్రిక్‌గా నొక్కితే తాళంచెవి తెరుచుకుంటుంది. చిన్న ప్లాన్ కాగితం దానిలో ఉంటుంది. ఆ ప్లాన్‌కి తాళంచెవి కూడా కావాలి. ఒకటి తరువాత ఒకటి తాళంచెవులు ఉపయోగిస్తేనే నిధి స్వాధీనం అవుతుంది."

"గుడ్. మరి నీ అసలు పేరు?"

"చూ, నాకు కోపం తెప్పించకు. బెదిరించి నానుండి రహస్యం లాగుదామని చూస్తున్నావు. మైకేల్ తెలియదు ఏమీలేదు. ఈ బెదిరింపేమిటి? నా పేరుతో పని ఏమి? నా నిజమైన పేరు కావాలంటే చెపుతా. నా నామం జపిస్తూ కూర్చో. పోలీసులు ఎవరికోసమయితే తీవ్రంగా

గాలిస్తున్నారో, మద్రాస్, బొంబే, కలకత్తా నగరాలలో పంధొమ్మిదిమంది అమ్మాయిలను రేప్ చేసి తప్పించుకు తిరుగుతున్నాడో, లక్షాధికారి హరేరాంని ఘోరంగా హత్యచేసి అతని ఇనప్పెట్టెలో విలువైన సామగ్రి సొంతం చేసుకున్నాడో, ఎవరిపేరు చెపితే మనుషులు హడలి పోతారో, ఆ సాహూచంగల్ నేనే! నా అసలుపేరు అది. అందరికీ తెలిసినపేరు భగవత్ దాస్."

వాంగ్ యాచూ రెండడుగులు వెనక్కి వేశాడు. "భగవత్ దాస్" అన్నాడు నిర్ఘాంతపోతూ.

"ఊఁ. ఇక చెప్పు, భయపడే పనిలేదు. మైకేల్ నిజంగా నీకు తెలిస్తే చెప్పదలుచుకుంది చెప్పు. ఆ బిళ్ళ తాళంచెవి వుంటే చాలు. మన పని అయిపోతుంది. అంతులేని సంపదతో మనం మీదేశం కాకపోతే మరో దేశం వెళ్ళి రాజుల్లా బ్రతుకుదాము."

"మైకేల్ మరణించి ఉండి, అతని వస్తువులు ఉంటే?" కాసేపు ఆలోచించి అన్నాడు చూ.

"వాడి శవమూ, వస్తువులు కావాలి" అన్నాను.

"మైకేలు మరణించాడు. నేనే అతన్ని చంపాను. ఇందాక చెప్పానే మైకేల్ ని ముక్కలుచేసి కూర వండించాను. అందరి కడుపులోకి వెళ్ళి అరిగికూడా పొయ్యాడు."

"ఓ గాడ్, ఎంత పనిచేశావ్ చూ! అతని మెడలో పెద్ద శిలువ వుంది, అదీ పోయిందా? నాశనం సర్వనాశనం. ఆ శిలువలో తాళం బిళ్ళను దాచాడు. నాకు బాగా తెలుసు ఈ విషయం" పెద్దగా అరిచాను కుర్చీలోంచి గబుక్కున లేచి.

"శిలువ ఉంది" నవ్వుతూ అన్నాడు చూ.

...! అయితే, నిధి అన్నావ్. ఆ వివరం నాకు ... ఇద్దరం చెరిసగం వాటా తీసుకుందాం. నన్ను ...తో, చంపటానికి పూనుకోటమో, చేశావనుకో. ఆ ...వుండీ చెప్పను. చాకనన్నా చస్తాగాని, నాతో ...నా మాయం అవుతుంది. నీవే చెప్పావుగా ...చోట చెరితేగాని నిధి రాదని."

...ని చంపటంవల్ల నాకేం వరగదు. చేతులారా ...నం చేసుకున్న వాడినవుతాను. మంచయినా, ...నా మనిషిని మనిషి నమ్మాలి మిస్టర్ చూ! అప్పుడే ...తాయి" అంటూ నిధి గురించి కొన్ని విషయాలు ... చెప్పే విధంగా చెప్పాను చూకి.

...ముఖం వెలిగిపోయ్యింది.

...కేల్ ని ఎందుకు చంపావు మిస్టర్ చూ!"

...ప్పు లాభం ఏముంది?"

మైకేల్ చచ్చినా బ్రతికినా ఒకటే నాకు కావల ...శింబిళ్ళ దాచిన శిలువ. నీ ఇష్టమయితే చెప్పు ...తే, దాచుకో!"

...రం తెచ్చుకోకు. నిజం ఏమిటంటే, హోటల్ ...న్నమాటేగాని పైసా లాభంలేదు. ఇంతవరకు పడి ...తో ఇలా లాక్కొస్తున్నానంటే లాభాలొచ్చి ...పెట్టుబడిపై కొంచెం మిగిలీ కాదు. మరో పని చేత ...ఇలా రోజులు దొర్లిచ్చేస్తున్నాను. ఓ రోజు రెండు ...కేసులతో ఈ హోటల్లో దిగాడు ఒకతను. అతనే ...ప్పిన మైకేల్. నీవు వర్ణించిన రూపం అక్షరాలా ...పైగా మెడలో పెద్ద శిలువ."

"అసలు విషయం చెప్పటంలేదు" చూ మాటలకు రవంత విసుగు ప్రదర్శిస్తూ అడిగాను.

"వివరం చెప్పకపోతే ఎలా తెలుస్తుంది? మైకేల్ మా హోటల్లో ఏకంగా రెండు నెలలకు బుక్ చేసుకున్నాడు. నీలాగే రూమ్ విడిచి బైటకు వచ్చేవాడు కాదు. ఎప్పుడయినా సాయంత్రం వేళల బైటకు వెళితే పూర్తిగా వేషం మార్చుకునేవాడు."

"ఏ విధంగా తయారయేవాడు?"

"చాలాసార్లు రూమ్‌లో ఉన్నప్పుడు చూచాను ముందు రెండు పళ్ళు లేవు. కాఫీ టిఫెన్‌కి రూమ్‌లోంచి బైటకు వచ్చేవాడు కాదు. బేరర్ రూమ్‌లోపలికి అన్నీ సప్లయి చేసేవాడు. మధ్యమధ్య యోగక్షేమాలు కనుక్కోటానికి నేను రూమ్‌లోకి వెళ్ళేవాడిని. అప్పుడు చూచాను. మైకేల్‌కి ముందుపళ్ళు రెండు లేనట్లు. బయటకు ఎప్పుడయినా వెళ్ళాలంటే పళ్ళు పెట్టుకునేవాడి నంటినే ఆ పళ్ళు కొంచెం పొడుగ్గా కనిపిస్తూ ఉండేవి.

మైకేల్ పేరు, మెడలో శిలువ క్రిష్టియన్ అనిపిస్తుంది కదా? కాని...ఇక్కడ తిరిగే ముస్‌లిమ్స్ తరచు ధరించే దుస్తులు ధరించే ఆ వేషంలో బైటకు వెళ్ళేవాడు. మైకేల్ మీద నాకు అనుమానం వచ్చింది. ఓరోజు అర్ధరాత్రి అతను రెండో ఆట పిక్చర్‌కి వెళ్ళాడు. మారు తాళం చెవితో మైకేల్ రూమ్ తలుపు తెరిచి రూమ్‌లో ప్రవేశించాను. మైకేల్ ఓ సూట్‌కేసుకి తాళంవేశాడు. మరో సూట్‌కేసుకి తాళంలేదు. ఆ రెండు సూట్‌కేసులు తెరిచి చూచాను. కళ్ళు చెదిరిపోయ్యాయి."

"ఏమున్నాయి దానిలో?" ఆతృతగా అడిగాను.

"అన్ని వందరూపాయల నోట్లు సరికొత్తవి. కొన్ని లక్షలు ఉంటాయి. ఓ పక్కగా బంగారంతో తయారయిన కడ్డీలు, బిస్కెట్స్ ఆకారంతో బంగారం బిళ్ళలు, కిలో తూగే ముత్యాలు, నాలుగు మణులు చిన్నచిన్నవి. ఖరీ దెంతుంటుందో తెలియదు. ఇవన్నీ ఉన్నాయి. ఓ పిస్టల్ కూడా ఉంది. మరో సూట్ కేస్‌లో ఖరీదైన సూట్లు ఉన్నాయి. అన్నీ చూచాను. యథాప్రకారం తాళాలు వేశాను.

నాలుగు రోజులు ఆగి మాటల సందర్భంలో అడిగి నట్లుగా మీదే ఊరు? మీ వాళ్ళెందరు? అంటూ అడి గాను. నావైపు అనుమానంగా చూచాడు. అదేం నే గమనించనట్లు ఉండిపొయ్యాను. తనకి చాలామంది పిల్లలుట. భార్య నాలుగేళ్ళక్రితం మరణించిందిట. పిల్లలను నాయ నమ్మ దగ్గర ఉంచి ఏదయినా బిజినెస్ చేసుకుందామని పొట్టపట్టుకుని ఇలా బైలుదేరి వచ్చాడుట. రెండెకరాల పొలం అమ్మి ఆ డబ్బుతో వచ్చాడుట. ఏం వ్యాపారం చేద్దామా? అని చూస్తున్నాడుట. మైకేల్ చెప్పిన సంగ తులు ఇవి" శ్వాస పీల్చుకోటానికా అన్నట్లు ఒక్క నిమిషం ఆగాడు చూ.

"దొంగ వెధవ. తనవద్ద నున్నదంతా మూటగట్టుకుని నాకు కనపడకుండా దాక్కోటానికి పారిపోయి వచ్చాడు. ఊ... మంచి కట్టుకథ అల్లాడు. ఆ తర్వాత ఏమయింది. ఏ విషయంలోనయినా నీతో పేచీ పెట్టుకున్నాడా?"

"ఉహూ, మంచిగా నే ఉన్నాడు. డబ్బుకోసం నేనూ చాంగూ ఆలోచించి చిన్న వలపన్నాము. చాంగ్ పుట్టిన రోజు, ఈ రోజు మా ఇంట్లో మాతోపాటు విందు ఆరగిద్దురు గాని రండని పిలిచాను. మైకేల్ నమ్మి రాత్రి డిన్నర్‌కి

మేడపైకి వచ్చాడు."

"మైకేల్ చాలా జాగ్రత్త మనిషి. మీరు పిలవంగానే వచ్చాడా? నేను నమ్మను."

"మైకేల్ చాలా జాగ్రత్త మనిషని నేనూ కని పెట్టాను. చాంగ్‌ని మీరూ చూచారుగా? అందమైనది. నా ప్లాను ప్రకారం. తరుచు మైకేల్‌కి కనపడుతూ అతన్ని ఆరాధిస్తున్నట్టు ప్రేమగా, సిగ్గుగా చూస్తుండేది."

"అలా చెప్పండి మిస్టర్ వాంగ్ యీచూ! మైకేల్‌కి వెరైటీ సరుకుకావాలి. నాకు బాగా తెలుసు. నీగ్రోస్, ఫ్రెంచ్, ఆంగ్లో ఇండియన్స్, ఫారెన్ గరల్స్, అన్ని రకాల జాతుల ఆడవాళ్ళను చూచాడు.

"డిన్నర్‌కి స్వయంగా చాంగ్ వెళ్ళి పిలవటంవల్ల ఆరాత్రి పైకి వచ్చాడు. మా దేశంలో ప్రసిద్ధమైన సూప్, అంటూ మొదట టమేటా సూప్‌ని ఇచ్చాము. నిజమే అనుకుని, మా ఆచారం ప్రకారం ముగ్గురం సూప్ తింటూ కూర్చున్నాము. సూప్‌లో మత్తుపదార్థం కలపటంవల్ల మైకేల్ అప్పటికప్పుడే మత్తుగా తల వాల్చాడు. అంతే."

"అంటే, ఆ తర్వాత...?"

"ఏముంది? వెరీ సింపుల్. చకచక మైకేల్ కంఠం నులమటం, ముక్కలు ముక్కలుగా శరీరాన్ని ఖండించి మాంసం మాంసంలో చేర్చటం, బొమికలను బొమికల్లో చేర్చటం చకచకా అయిపోయింది."

"మైకేల్ సామానులన్నీ ఎక్కడ దాచారు?"

"మీ ప్లాన్ అర్థం అయింది. సామాను గురించి చెపితే శిలువ తీసుకుందామనా?" చూ నావైపు తీక్షణంగా చూస్తూ అడిగాడు.

"మిస్టర్ చూ! దొంగయినా, దొరయినా జాయింట్‌గా

పనిచేసేటప్పుడు ఒకరినొకరు నమ్మాలి. నేను ఆ శిలువ కాజేసే ఉద్దేశ్యంతో అడగటం లేదు. యథాలాపంగా అడిగాను. సరే, నేను పూర్తిగా మిమ్మల్ని నమ్మాను. మనం దక్కించుకోబోయే నిధి చెరిసగం. సరేనా? ఇహాపై ముందు కార్యక్రమం గురించి ఇరువురం చర్చించుకుని చేద్దాం. డబ్బుకోసం మైకేల్‌ని చంపినట్లు నన్ను చంపటానికి మాత్రం ప్రయత్నించవద్దు.''

''నా మాటలకు కోపం వచ్చినట్లుంది? సారీ! తొందర పడ్డాను'' చూ అన్నాడు.

''నావద్ద డబ్బు వున్నట్లు చూచారు. మైకేల్‌ని చంపినట్లు నన్నూ చంపటానికి ప్రయత్నిస్తే మీ మెడకు మీరే ఉచ్చు బిగించుకున్నట్లు'' ముందు జాగ్రత్తపడుతూ అన్నాను.

''మనిషిని నమ్మాలని మీరే చెప్పి మళ్ళీ ఇదేం మాట? బంగారు బాతు బంగారు గుడ్డు రోజుకొకటి మాత్రమే పెడుతున్నదని బాతునే చంపితే పొట్టలో ఎన్ని బంగారు గుడ్లు ఉంటాయో అని ఆశపడితే ఫలితం ఏమయిందో నాకు తెలియందికాదు. అలాంటి పిచ్చి పని ఎప్పుడూ చేయను.''

''గుడ్, నిన్ను నమ్ముతున్నాను మిస్టర్ చూ! ఈ లల్లూరాంగాడి శవాన్ని ఇప్పుడే ముక్కలు చేయవద్దు. నా అనుచరులచేత వీడున్న ప్రదేశం, సామాన్లు వెతికించి అప్పుడు చూద్దాం వీడి శరీరంలోనే ఏ భాగంలోనయినా దాచాడేమో?''

''సరే. అలాగే చేద్దాము.''

''ఓసారి ఇప్పుడే మనవాళ్ళకు ఫోన్ చేద్దాము.''

''అలాగే.''

నేనూ, వాంగ్ యీాచూ ఫోన్ చేయటానికి కిందకు బైలుదేరాము.

7

తెల్లవారుఝాము 4 గంటలు కావస్తున్నది.

"ఊఁ, చేతులు పైకెత్తు!" పిస్టల్ కిందకు పైకి ఆడిస్తూ అన్నాను.

"మోసం, ఇదేమిటి? వీళ్ళంతా ఎవరు? నీఅనుచరులా? నన్ను బెదిరించినా, బంధించినా, చచ్చినా ఆ శిలువెక్కడుందో చెప్పను-" వాగ్ యీాచూ కోపంగా ఊగిపోతూ అన్నాడు.

"మిస్టర వాగ్ యీాచూ! శిలువెక్కడుందో నాకు తెలుసు."

"అబద్ధం! నాకూ చాంగ్ కి తప్ప ఎవరికి తెలియని చోట దాచాను. మైకేల్ హత్య బయట పడుతుందేమో ఆనే భయంతో మైకేల్ ధనాన్ని రెండు మూడేళ్ళదాకా వాడకూడదని పెరటి వేపు భూమిలో పాతిపెట్టి కిచన్ రూమ్స్ పెంచాలంటూ దాని పైగోడ పెట్టించి మరో రూమ్ ఆ వారంలోనే కట్టించాను."

"వెరీగుడ్, మనిషికి ఆవేశం తెప్పిస్తే మూర్ఖుడిలా మారుతాడు. నీ నోటినుంచే ఆశాస్త పూర్తి అయింది. సరే, పిస్టల్ మటుకు మైకేల్ ది కదూ?"

అన్ని రహాశ్యాలు నాకెలా తెలిసి పోయాయా అని, అయోమయంగా ముఖం పెట్టి, అవునన్నట్లు తలాడించాడు వాగ్ యీాచూ.

నా పక్కనున్నతనికి కనుసైగ చేశాను. అతను బైటకు వెళ్ళిపోయాడు.

"నమ్మించి ద్రోహం తలపెట్టావు. నిన్నుమించిన

ద్రోహి ఎక్కడా ఉండడు.'' నవ్వి ఊరుకున్నాను.

బూట్లు టకటకలాడిస్తూ, ఇన్‌స్పెక్టర్ పైకి వచ్చాడు.

''ఇహ నీపని కానియ్యవచ్చు ఇన్‌స్పెక్టర్ భాయ్! నాపని అయిపోయింది.'' బేడీలు తీసుకొని ఇన్‌స్పెక్టర్, వాంగ్ యీ చూ వద్దకు నడిచాడు.

''ఇదేమిటి? ఇదేమిటి?'' వాంగ్ యీ చూ గజగజ వణకిపోతూ అన్నాడు.

''ఓహ్, అసలు విషయం నీకు చెప్పలేదు కదూ? స్మగ్లర్స్‌వల్ల దేశం ఎంత గానో నష్టపోతున్నది. వాళ్ళు మకుటం లేని మహారాజుల్లా చలామణీ అవుతున్నారు. పోలీసు డిపార్టుమెంటు ప్రభుత్వము కళ్ళు మూసుకునిలేరు. స్మగ్లర్స్‌ని బంధిస్తూనే ఉన్నారు. అయితే ఉన్నత పదవుల్లో ఉన్న ఉన్నతాధికారులు కూడా కొందరు స్మగ్లర్స్‌తో చేతులు కలపటంవల్ల సరిఅయిన న్యాయం జరగలేదు. ఈ ఎమర్జన్సీలో స్మగ్లర్స్‌ని పట్టుకోడం, వాళ్ళ ఆస్తులు అక్రమ సంపాదనని తెలిస్తే ఆస్తులను జప్తు చేసుకోవడం అమలు పరిచారు. పెద్ద పెద్ద స్మగ్లర్స్‌ని ఎప్పుడయితే ప్రభుత్వం పట్టేసిందో, అప్పుడు కొందరు పెద్ద స్మగ్లర్స్ పరారయారు. మైకేల్ పేరు పొందిన పెద్ద స్మగ్లరు. తనని పట్టుకోడానికి పోలీసులొస్తున్నారని, తన ఉనికి ఆధారాలతోసహా తెలిసిపోయిందని ఎప్పుడయితే తెలుసుకున్నాడో, వీలయినంత రొక్కం నగలు నాణ్యాలు మూటగట్టుకుని పరారయాడు.

మైకేల్ వెనకనే బైలుదేరి వెతుకుతూ రంగూన్ దాకా వచ్చాము. రంగూన్‌లో మైకేల్ చటుక్కున మాయమయాడు. మైకేల్ ఈ హోటల్లో దిగినట్లు తెలుసుకున్నాము. హోటల్లో దిగిన మైకేల్ హోటల్ దాటి

బైటకి పోనట్లు మాకు తెలుసు.. మరి ఏమయినట్టు? ఈ హోటల్లోనే దాగి ఉన్నాడా? సజీవ సమాధి అయ్యాడా? అది తెలుసుకోడానికే మేము విశ్వప్రయత్నం చేశాము. ఫలితం శూన్యం. నేనో కొత్తప్లాన్ వేశాను. బందిపోటు దొంగ భగవత్ దాస్ రెండేళ్ళ క్రితం జైలునుండి పరారయి ఇంతవరకూ పట్టుపడకుండా తిరుగుతున్నాడు.

ఒక దొంగగా డబ్బు విచ్చల విడిగా వెదజల్లే మారు వేషగాడిలా ... బందిపోటు భగవత్ దాసుగా... నేను రూపం దాల్చి నీహోటల్లో స్థానం సంపాదించాను. నన్ను నమ్మావు. నా అనుచరులు నాతోపాటు నాటకం ఆడి సహకరించారు. అల్లూరాం ఎవరనుకున్నావు? ఇదిగో ఈ ఇన్ స్పెక్టర్ గారే. అల్లూరాం మరణించాడని చెప్పి, పెట్టెలో పెట్టి మనం కిందకు వచ్చాము. అప్పుడు గాలి కోసం పెట్టెలోంచి బైటకు వచ్చాడు. నేను కాల్చింది బొమ్మపిస్టల్ అల్లూరాం పొట్ట నొక్కుకుంటూ ముందుకు పడిపోతే వీపుమీదనుంచి రక్తం వచ్చే ఏర్పాటు ముందే చేసుకొచ్చాడు.

నీవు, నన్ను బాగా నమ్మాలని పిస్టల్ తో కాలికీ, చేతికీ, కాల్చుకుని గాయం చేసుకు వచ్చాను. నాపై పూర్తి నమ్మకం ఏర్పడింది. నిధిలేదు, నిక్షేపమూలేదు. ఆశ మానవుడిని రాక్షసుడిగా మారుస్తుంది. అదే జరిగింది. అన్నట్లు నీమాటలన్నీ రికార్డు అయ్యాయి. వేరే సాక్ష్యం అక్కరలేదు. ఓ అన్నట్లు నే నెవరో నాపేరు ఏమిటో చెప్పలేదుకదూ? నేను డిటెక్టివ్ ని, నాపేరు విజయ్. ఇప్పుడర్థం అయిందా మిష్టర్ వాగ్ యీచూ!"

వాంగ్ యీచూ తల వంచుకున్నాడు.

—: ఐ పో యిం ది :—